# బలగం TV BALAGAM

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ మంగళవారం 27 మే 2025 | www.balagamtv.com | పేజీలు 4


## దేశంలో వెయ్యి దాటిన కరోనా కేసులు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

కేంద్ర ఆరోగ్య, కుటుంబ మంత్రిత్వ శాఖ సమాచారం ప్రకారం.. దేశవ్యాప్తంగా మొత్తం 1009 యాక్టివ్ కేసులు నమోదయ్యాయి. ఇందులో కేరళ నుంచి అత్యధికంగా 430 ఉన్నాయి. గతవారం నుంచి ఇక్కడ 335 కేసులు పెరిగాయి. మహారాష్ట్ర (209 కేసులు) రెండో స్థానంలో ఉన్నది. ఇక్కడ వారం వ్యవధిలో 153 కేసులు పెరిగాయి. అలాగే, నాలుగు మరణాలు నమోదయ్యాయి. ఇక ఢిల్లీలో 99 కేసులు పెరిగి ఆ సంఖ్య 104కు చేరింది. ఇక గుజరాత్ (83), తమిళనాడు (69), కర్నాటక (47), యూపీ (15), రాజస్తాన్ (13), పశ్చిమ బెంగాల్ (12), పుదుచ్చేరి (09), హర్యానా (09), ఆంధ్రప్రదేశ్ (04), మధ్యప్రదేశ్ (02), తెలంగాణ, గోవా, ఛత్తీస్‌గఢ్‌లలో ఒక్కటి చొప్పున నమోదైన కేసులతో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. కాగా, అండమాన్ నికోబార్, అరుణాచల్ ప్రదేశ్, అసోం, బీహార్, హిమాచల్‌ప్రదేశ్, జమ్మూకాశ్మీర్ లలో యాక్టివ్ కేసులు నమోదు కానట్టు సమాచారం. దేశంలో పెరుగుతున్న కరోనా కేసుల పట్ల ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్) డైరెక్టర్ జనరల్ రాజీవ్ బహల్ స్పందించారు. కరోనా కొత్త వేరియంట్ల పట్ల భయాందోళనలు వద్దని అన్నారు. అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. పలు కీలక సూచనలు కూడా చేశారు. ప్రాథమిక జాగ్రత్తలు తీసుకోవటం అవసరమని చెప్పారు. దీర్ఘకాలిక వ్యాధులు, క్యాన్సర్ రోగులు, రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు ఇన్‌ఫెక్షన్ బారిన పడకుండా మాస్కులు ధరించటం సహా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. పరిస్థితిని ప్రభుత్వ విభాగాలు గమనిస్తున్నాయన్నారు.

# ముంబైను ముంచెత్తిన వాన

- ముంబైలో భారీ వర్షాలు
- 107 ఏళ్ల రికార్డ్ బద్దలు
- పలు ప్రాంతాలకు ఐఎండీ రెడ్ అలర్ట్ జారీ
- బీఎంసీ పరిధిలో 200 మి.మీ. దాటిన వర్షపాతం
- స్తంభించిన జనజీవనం
- కేరళలో పలు జిల్లాలకు రెడ్ అలర్ట్
- కర్నాటక, తమిళనాడులోనూ ప్రభావం




**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

దేశంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. మహారాష్ట్ర, కేరళ, కర్నాటక, తమిళనాడుతో పాటు పలు రాష్ట్రాల్లో వరదలు జనజీవనాన్ని స్తంభింపజేశాయి. నైరుతి రుతుపవనాలు ప్రవేశించిన మొదటి రోజునే ముంబయిలో సోమవారం భారీ వర్షం దంచికొట్టింది. 07 సంవత్సరాల చరిత్రను చెరిపేస్తూ నగరంలో 295 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అనుకున్న దాని కంటే 16 రోజుల ముందుగానే రుతుపవనాలు ముంబయిలో ప్రవేశించాయని భారత వాతావరణ కార్యాలయం తెలిపింది. భారీవర్షాలతో ఆయా చోట్ల జనజీవనం స్తంభించింది. ముంబయిని గంటల వ్యవధిలోనే వరణుడు ముంచెత్తాడు. రహదారులు చెరువులను తలపిస్తున్నాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కర్ణాటక, తమిళనాడు, కేరళలో సైతం భారీ వర్షాలు కురుస్తుండగా అధికార యంత్రాంగం అప్రమత్తమై, సహాయక చర్యలు చేపట్టింది. పలు చోట్ల రెడ్ అలర్ట్ జారీ చేశారు.

ముంబైలో గత 107 సంవత్సరాలలో ఎన్నడూ లేనంతగా మే నెలలో అత్యధిక వర్షపాతం నమోదై, సరికొత్త రికార్డు సృష్టించింది. ఆదివారం అర్ధరాత్రి నుంచి కురుస్తున్న కుండపోత వానలతో నగరం అక్షరాలా జలదిగ్బంధంలో చిక్కుకుంది. జనజీవనం స్తంభించిపోగా, భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ముంబయి సహా పలు జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసి, పరిస్థితి తీవ్రతను స్పష్టం చేసింది.సోమవారం ఉదయం 11 గంటల సమయానికే బృహన్‌ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) పరిధిలోని అనేక ప్రాంతాలు 200 మిల్లీమీటర్లకు పైగా వర్షపాతంతో తడిసి ముద్దయ్యాయి. ముఖ్యంగా దక్షిణ ముంబయిపై వరుణుడు ప్రతాపం చూపించాడు. నారిమన్ పాయింట్ స్టేషన్‌లో అత్యధికంగా 252 మి.మీ., బైకుల్లా ఈ-వార్డులో 213 మి.మీ., చారిత్రక కొలాబా ప్రాంతంలో 207 మి.మీ., డు టకి స్టేషన్‌లో 202 మి.మీ. చొప్పున రికార్డు స్థాయి వర్షపాతం నమోదైంది. మెరైన్ లైన్స్, చందన్‌వాడీ, మెమోన్‌వాడ, వర్లీ వంటి ప్రాంతాలు కూడా 170 మి.మీ. పైబడిన వర్షపాతంతో అతలాకుతలమయ్యాయి.దక్షిణ ముంబయిపై వర్షం ప్రభావం తీవ్రంగా ఉంది. రహదారులపైకి వరదనీరు చేరి, చెరువులను తలపిస్తున్నాయి. చాలాచోట్ల లోతట్టు ప్రాంతాలు నీటమునిగి ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. వాహన రాకపోకలు, రైలు, విమాన సర్వీసులకు తీవ్ర అంతరాయం కలిగింది. ముంబయి, ఠాణే, రాయగడ్, రత్నగిరి ప్రాంతాలకు భారత వాతావరణ విభాగం-రెడ్ అలర్ట్ జారీ చేసింది. వీటి పొరుగు జిల్లాల్లో కూడా అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. మంగళవారం ఉదయం వరకు ఈ హెచ్చరికలు అమల్లో ఉంటాయని పేర్కొంది.

### కేరళలో భారీ వర్షాలు

కేరళలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. కొన్ని రోజులుగా ఇక్కడ కురుస్తున్న వర్షాలకు జన జీవనం స్తంభించింది. ఈ నేపథ్యంలో భారత వాతావరణ సంస్థ (ఐఎండీ) సోమవారానికి రాష్ట్రంలోని 11 జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. అతి భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. మూడు జిల్లాలు త్రిస్సూర్, మలప్పురం, కాసర్‌గోడ్‌లకు ఆరెంజ్ అలర్ట్‌ను ఇష్యూ చేసింది. భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. ఇక మిగతా జిల్లాలకు యెల్లో అలర్ట్‌ను జారీ చేసింది. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షం విధ్వంసం సృష్టించింది. సోమవారానికి రెడ్ అలర్ట్ జారీ అయిన 11 జిల్లాల్లో పాలక్కడ్ మినహా అన్ని జిల్లాల్లో విద్యా సంస్థలకు సెలవు ప్రకటించారు. పరీక్షలు వాయిదా పడ్డాయి. కోజీకోడ్‌లో భారీ వర్షాలకు

మిగితా 2వ పేజీలో

# భారత్‌ను ద్వేషించడమే పాక్ లక్ష్యం

- భారత్ లక్ష్యం పేదరికాన్ని నిర్మూలించటం. ఆర్థికవ్యవస్థను బలోపేతం చేయటం అభివృద్ధి చెందటం
- పాకిస్థాన్ ప్రతీకారదాడులను భారత సైన్యం తిప్పికొట్టింది
- ప్రధాని మోడీ



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

దేశ విభజన తర్వాత ఏర్పడిన పాకిస్థాన్ భారత్‌తో శత్రుత్వమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. గుజరాత్ పర్యటనలో భాగంగా దోహద్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. దోహద్‌లో దాదాపు రూ.24వేల కోట్ల విలువైన అనేక అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు. రైల్వే లోకోమొటివ్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్‌తోపాటు 9వేల హార్స్‌పవర్ సామర్థ్యం కలిగిన దేశంలోనే తొలి లోకోమోటివ్ ఇంజిన్‌ను ప్రారంభించారు.

అనంతరం జరిగిన బహిరంగ సభలో ప్రధాని మోడీ మాట్లాడారు. భారత్‌ను ద్వేషించడమే పాకిస్థాన్ లక్ష్యమని, మన దేశానికి చేయాలన్న ఉద్దేశంతో ఆ దేశం ఉందని, కానీ మనం మాత్రం పేదరిక నిర్మూలన, ఆర్థిక ప్రగతి లాంటి అంశాలను టార్గెట్‌గా పెట్టుకున్నట్లు చెప్పారు. ఆపరేషన్ సింధూర్ గురించి ప్రస్తావిస్తూ.. మన సోదరీమణుల సింధూరాన్ని తొలగిస్తే, ఉగ్రవాదుల అంతం దగ్గరపడినట్లే అని పేర్కొన్నారు. వడోదరలో జరిగిన రోడ్ షోలో వేల సంఖ్య తల్లులు, అక్కాచెల్లెళ్లు ఆ ఈవెంట్ లో పాల్గొన్నట్లు చెప్పారు. భారతీయ సాయుధ బలగాలు సాధించిన విజయాన్ని వాళ్లు ఎంజాయ్ చేశారన్నారు. తిరంగ ర్యాలీ చేపడుతూ.. ఆపరేషన్ సిందూర్ కు దీవెనల ఇస్తున్నట్లు చెప్పారు. ఒకవేళ ఎవరైనా ఆడవాళ్ల సింధూరాన్ని లాక్కెళ్లాలని చూస్తే, వాళ్లను అంతం చేయడమే తమకు ముఖ్యం అవుతుందన్నారు. ఆపరేషన్ సింధూర్ అనేక కేవలం మిలిటరీ చర్య మాత్రంక కాదు అని, కానీ అది భావోద్వేగాలకు చెందిన అంశమన్నారు. మోదీతో పెట్టుకోవద్దు అన్న విషయంలో ఉగ్రవాదులు కలలో కూడా ఊహించి ఉండరన్నారు. పెహల్గామ్ దాడి ఘటన ఫోటోలను చూస్తుంటే రక్తం మరుగుతోందన్నారు. దేశ సైన్యం బలంగా ఉన్నప్పుడే వికసిత్ భారత్ సాధ్యమవుతుందన్నారు.

# విద్యుత్ కార్మికులకు కోటి ప్రమాద బీమా




- దేశ చరిత్రలోనే ఓ రికార్డు
- ఇందిరమ్మ ప్రభుత్వ ఆలోచనకు అద్దం పడుతుంది
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

విద్యుత్ కార్మికులకు కోటి రూపాయలకు పైబడి ప్రమాద బీమా అందించడం దేశ చరిత్రలోనే ఒక రికార్డు అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. సోమవారం ఉదయం ప్రజాభవన్ లో ఎన్‌పీడీసీఎల్ పరిధిలో విధులు నిర్వహిస్తూ ప్రమాదవశాత్తు ప్రాణాలు కోల్పోయిన జోగు నరేష్ కుటుంబ సభ్యులకు కోటి రూపాయల ప్రమాద బీమా చెక్కు తో పాటు విద్యుత్ శాఖలో నరేష్ శ్రీమతికి కారుణ్య నియామక ఉత్తర్వులు అందజేసిన సందర్భంగా డిప్యూటీ సీఎం ప్రసంగించారు.

విద్యుత్ కార్మికునికి కోటి రూపాయల ప్రమాద బీమా చెక్కును అందించడం కేవలం సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ఇందిరమ్మ ప్రభుత్వంలోని సాధ్యం అయ్యింది అన్నారు. గతంలో కార్మికుల కోసం ఏ ప్రభుత్వం ఇంత గొప్పగా ఆలోచన, ప్రయత్నం చేయలేదని తమ ప్రభుత్వం వచ్చాకే ఇది సాధ్యం అయింది అన్నారు. ప్రమాద బీమా మరియు కారుణ్య నియామక పత్రం అందించడం ప్రభుత్వ ఆలోచనకు, కార్యాచరణకు , మానవీయ కోణానికి అద్దం పడుతుంది అన్నారు. కార్మికులకు ప్రమాద బీమా పథకాన్ని మొదట సింగరేణిలో ప్రవేశపెట్టి అనంతరం విద్యుత్ సంస్థల్లోనూ ఆచరణలోకి తీసుకువచ్చిన విషయాన్ని డిప్యూటీ సీఎం గుర్తు చేశారు. కోటి రూపాయల పైబడి ప్రమాద బీమా విద్యుత్ సంస్థలో పనిచేసే కార్మికుల అందరిలో ఓ కొత్త భరోసా నింపుతుంది అన్నారు. విద్యుత్ ఉద్యోగులు అంకితభావంతో రాష్ట్ర ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని డిప్యూటీ సీఎం కోరారు. ప్రభుత్వ ఆలోచనను సమర్థవంతంగా అమలు చేసిన ఎన్‌పిడిసిఎల్ సిఎండి వరుణ్ రెడ్డిని ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం అభినందించారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి విద్యుత్తు, బ్యాంకు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# తెలంగాణను తాకిన రుతుపవనాలు



- ఏపీ, కర్నాటక, మహారాష్ట్ర, ఈశాన్యరాష్ట్రాలకు విస్తరణ
- నేడు బంగాళాఖాతంలో అల్పపీడనం
- రాష్ట్రంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశం

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

నైరుతి రుతుపవనాలు ముందే తెలంగాణను తాకాయి. ఈ మేరకు భారత వాతావరణ కేంద్రం ప్రకటించింది. తెలంగాణలోకి ప్రవేశించాల్సిన సమయం కంటే 17 రోజులు ముందుగానే ప్రవేశించాయి. రుతపవనాలు మహబూబ్‌నగర్ వరకు విస్తరించాయి. ఒకటి, రెండు రోజుల్లో రాష్ట్రమంతా విస్తరిస్తాయి. ఇక ఏపీ, కర్నాటక, మహారాష్ట్ర, ఈశాన్య రాష్ట్రాల్లోని పలు ప్రాంతాలకు విస్తరించాయి. మరోవైపు మంగళవారం బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశముంది. ఉత్తర తెలంగాణ మీదుగా ఉపరితల ద్రోణి ఛత్తీస్‌గఢ్ వరకు విస్తరించి ఉంది. వీటి ప్రభావం వల్ల రాష్ట్రంలో వచ్చే మూడు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు పలు జిల్లాల్లో కురిసే అవకాశముంది. ఈ మేరకు ఆయా జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ హెచ్చరికను జారీ చేసింది. ఆ జాబితాలో ఆదిలాబాద్, కొమ్రంభీం అసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్,

మిగితా 2వ పేజీలో

# రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఆధార్-ఈ సంతకం

- నేటి నుండి ఆర్మూర్, కూసుమంచి ఎస్ ఆర్ వో కార్యాలయాల్లో ప్రారంభం
- త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా అమలు
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్ర వ్యాప్తంగా ఆస్తి నమోదుల కోసం ఆధార్ ఈ-సిగ్నేచర్ వ్యవస్థను త్వరలో అమలు చేయనున్నట్లు రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సోమవారం తెలిపారు. ఈ వ్యవస్థతో కేవలం 15 నిమిషాల్లో నమోదు ప్రక్రియ పూర్తవుతుందని ఆయన అన్నారు. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మరియు ఖమ్మం జిల్లా కుసుమాంచి లోని ఉప-నమోదుదారుల కార్యాలయాల్లో పైలట్ ప్రాజెక్టుగా దీన్ని వెంటనే ప్రారంభించనున్నట్లు మంత్రి తెలిపారు.

జూన్ 2 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఆస్తి నమోదుల కోసం ఆన్‌లైన్ స్లాట్ బుకింగ్ వ్యవస్థను ప్రవేశపెట్టే సందర్భంలో, ఈ ఆధార్ ఈ-సైన్ వ్యవస్థను కూడా త్వరితంగా అమలు చేయాలని శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు.సచివాలయంలో స్టాంపులు మరియు నమోదుల శాఖ అధికారులతో సోమవారం జరిగిన సమీక్ష సమావేశంలో, జూన్ 2 నుంచి రాష్ట్రవ్యాప్తంగా స్లాట్ బుకింగ్ వ్యవస్థ అమలు, అలాగే భారీ వర్క్‌లోడ్ ఉన్న ఉప-నమోదుదారుల కార్యాలయాల్లో అదనపు రిజిస్ట్రార్ల నియామకం వంటి అంశాలు చర్చించబడ్డాయి.

పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, స్లాట్ బుకింగ్ వ్యవస్థతో పాటు ఆధార్ ఈ-సైన్ వ్యవస్థను ప్రవేశపెట్టడం ద్వారా నమోదు ప్రక్రియ మరింత వేగవంతం అవుతుందని పేర్కొన్నారు. సాంకేతిక సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పటాన్‌చెరు, యాదగిరిగుట్ట, గండిపేట్, సూర్యాపేట, జడ్చర్ల, మహబూబ్‌నగర్, వనపర్తి మరియు గద్వాల్ వంటి ప్రాంతాల్లో అదనపు ఉప-నమోదుదారులను నియమించారు. ఉప-నమోదుదారుల పనితీరు అవినీతి లేని విధంగా, ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా ఉండాలని, తద్వారా ప్రభుత్వ ప్రతిష్ఠ పెరగాలని మంత్రి పేర్కొన్నారు.

# కేటీఆర్‌కు ఏసీబీ నోటీసులు

- ఫార్ములా-ఈ రేసులో.. 28న హాజరు కావాలని ఆదేశం
- విదేశీ పర్యటనకు వెళ్లాల్సి ఉంది.. సమయం ఇవ్వండి
- ఏజెన్సీలకు నేను పూర్తిగా సహకరిస్తాను
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ఫార్ములా-ఈ కార్ రేసింగ్ కేసులో మరో పరిణామం చోటు చేసుకున్నది. ఈ నెల 28న తమ ఎదుట హాజరు కావాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు సోమవారం ఏసీబీ నోటీసులు జారీ చేసింది. ఈ కేసులో ఇప్పటికే ఒకసారి కేటీఆర్‌ను ఏసీబీ విచారించింది. ఆ సమయంలోనే అవసరమైతే మరోసారి విచారణకు పిలుస్తామని తెలిపింది. ఈ నేపథ్యంలో తాజాగా ఏసీబీ విచారణకు హాజరు కావాలంటూ నోటీసులు ఇచ్చింది.

ఈ కేసులో రామారావుతో పాటు సీనియర్ ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్, హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ మాజీ ఉద్యోగి బీఎల్ఎన్ రెడ్డి కూడా నిందితులుగా ఉన్నారు. ఈ ముగ్గురిని గత జనవరిలో విచారించిన ఏసీబీ, యుకేలోని ఫార్ములా ఈ రేసింగ్ ఆపరేషన్స్ లిమిటెడ్ సంస్థ అధికారులను కూడా ప్రశ్నించింది. దర్యాప్తులో సేకరించిన పత్రాల ఆధారంగా రామారావుకు తాజా నోటీసులు జారీ చేసినట్లు ఏసీబీ వెల్లడించింది.

### కేటీఆర్ స్పందన

ఈ నోటీసుపై కేటీఆర్ తన 'ఎక్స్' ఖాతా ద్వారా స్పందించారు. విదేశీ పర్యటనకు వెళ్లాల్సిన షెడ్యూల్ ఉన్నందున సమయం ఇవ్వాలని కోరారు. "న్యాయాన్ని గౌరవించే పౌరుడిగా ఏజెన్సీలకు నేను పూర్తిగా సహకరిస్తాను. అయినా ఈ కేసు పూర్తిగా రాజకీయ వేధింపు మాత్రమే," అని వ్యాఖ్యానించారు. తాను ముందుగానే యూకే, యుఎస్ పర్యటనల షెడ్యూల్ వేసుకున్నట్లు పేర్కొన్నారు. "ఈ విషయాన్ని ఏసీబీ అధికారులకు లిఖితపూర్వకంగా తెలియజేశాను," అని చెప్పారు. అలాగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారు: కాంగ్రెస్ ప్రభుత్వ తప్పిదాలు, అరాచకాలను ప్రశ్నిస్తున్నందుకు తనపై రగిలిపోతున్న సీఎం రేవంత్ రెడ్డి.. ప్రతీకారంతో ఎంతకైనా దిగజారుతారన్న సంగతి ఈ ఏసీబీ నోటీసులతో తేటతెల్లమైందని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆయన నాయకుడిగానే కాకుండా, మనిషిగా కూడా ఎంతగా పతనమవుతున్నారో చెప్పడానికి ఈ చౌకబారు ప్రతీకార చర్యలే నిదర్శనమంటూ విమర్శలు గుప్పించారు. బీఆర్ఎస్‌ను చూస్తే రేవంత్‌లో రోజురోజుకూ భయం పెరిగిపోతోందని ఎద్దేవా చేశారు అంతేకాక, రేవంత్ రెడ్డి పేరు నేషనల్ హెరాల్డ్ మనీలాండరింగ్ కేసులో ఈడీ ఛార్జ్‌షీటులో ఉందన్న కథనాలు ఇటీవలే బయటపడ్డాయని గుర్తుచేశారు."24 గంటల తర్వాత రేవంత్ రెడ్డి ప్రధాని మోదీతో సహా బీజేపీ కీలక నేతలతో కలిసి కనిపించారు. కానీ బీజేపీలో ఒక్క నాయకుడు కూడా రేవంత్ మనీలాండరింగ్ కేసుపై ఒక్క మాట కూడా మాట్లాడలేదు," అని విమర్శించారు.

# పార్టీ మారిన ఎమ్మెల్యేలకు ఉప ఎన్నికల్లో బుద్ధి చెప్పాలి

- కాంగ్రెస్ అభయహస్తం మేనిఫెస్టో శతాబ్దపు ఘోరమైన మోసం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- బీఆర్ఎస్‌లో చేరిన గద్వాల బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తలు



వివరాలు 2వ పేజీలో

# ముగిసిన సరస్వతి పుష్కరాలు..



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ సరస్వతి పుష్కరాలు ముగిశాయి. జయశంకర్-భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం దేవస్థానానికి ఆనుకొని ఉన్న త్రివేణి సంగమంలోని సరస్వతీ నదిలో 12 రోజుల పాటు పుష్కరాలు అంగరంగ వైభవంగా జరిగాయి. సోమవారం సరస్వతి ఘాట్ వద్ద జరిగిన పుష్కరాల ముగింపు వేడుకల్లో మంత్రి శ్రీధర్‌బాబు పాల్గొన్నారు. కాళేశ్వరంలో ఈ నెల 15న ప్రారంభమైన పుష్కరాలు నేటి వరకు అంగరంగ వైభవంగా కొనసాగాయి. ఆఖరి రోజున మాడుగుల నాగఫణి శర్మ సరస్వతి పుష్కరాలు, కాళేశ్వర క్షేత్ర వైభవాన్ని భక్తులకు తెలియజేశారు. పండితులు సరస్వతి నవరత్న మాల హారతిని నిర్వహించారు. అనంతరం సరస్వతీ దేవీకి కర్పూర నీరాజనం సమర్పించారు.

పుష్కరాలకు చివరి రోజు కావడంతో భక్తులు పోటెత్తారు. దీంతో పుష్కర్ ఘాట్ పరిసరాలు శివనామస్మరణతో మర్మోగాయి. తెలంగాణతోపాటు పలు రాష్ట్రాల నుంచి లక్షలాది మంది సందర్శకులు కాళేశ్వరానికి చేరుకొని సరస్వతి నదికి, సంగమం పుష్కర ఘాట్‌కు వెళ్లి పుణ్యస్నానాలు ఆచరించారు.

చివరి రోజు సోమవారం సాయంత్రం 7.30గంటలకు ఆలయ ప్రధాన అర్చకులు, వేద పండితులు, అధికారులు ఆలయ సంప్రదాయాలతో దేవస్థానం నుంచి శోభాయాత్రగా సరస్వతి నది సంగమం వరకు వెళ్లి కలశాలతో ముక్తీశ్వరు డిని అభిషేకించారు. అక్కడే నదీమ తల్లికి హారతి పట్టి చీర, సారెతో సాగనంపి తిరుగు ముఖం పట్టారు. చివరి రోజు కావడంతో రాష్ట్ర నలు మూలల నుంచి సుమారు

మిగితా 2వ పేజీలో

# విత్తన చట్ట ముసాయిదా రూపకల్పనలో రైతుల అభిప్రాయాలే కీలకం

- కమిటీ కన్వీనర్, వ్యవసాయశాఖ డైరెక్టర్ బి. గోపి.
- రైతుల అభిప్రాయాల కోసం గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు సమావేశాలు..
- రైతు సంక్షేమం కోసమే విత్తన చట్టం: సీడ్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి.
- విత్తన చట్టం ఏర్పాటు కోసం ప్రభుత్వం వేసిన కమిటీ.. ఫస్ట్ మీట్.

**బలగం టీవి, హైదరాబాద్**

రైతు కమిషన్ కార్యాలయంలో విత్తన చట్టం రూపొందించడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ సమావేశమైంది. ప్రభుత్వం.. కమిటీ ఏర్పాటు చేసిన తర్వాత మొదటిసారిగా బీఆర్కే భవన్ లో సమావేశమైయ్యారు. కమిటీ కన్వీనర్, అగ్రికల్చర్ డైరెక్టర్ గోపి అధ్యక్షత ఈ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కొత్తగా తీసుకురాబోతున్న విత్తన చట్టంలో ఎలాంటి అంశాలు చేర్చాలి అనే అంశాలపై సుదీర్ఘ చర్చించారు. ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న విత్తన చట్టాలపై అధ్యయనం చేయడంతోపాటు తెలంగాణలోని రైతుల నుండి సూచనలు సలహాలు తీసుకొని సమగ్ర విత్తన చట్టం రూపొందించాలని అభిప్రాయానికి వచ్చిన వచ్చింది కమిటీ. విత్తన చట్ట ముసాయిదాలో కీలకంగా రైతుకు విత్తన హక్కు కల్పించడం, నకిలీ విత్తనాలు అరికట్టడం, ఒకవేళ నకిలీ విత్తనాలతో నష్టపోయిన రైతులకు ఏవిదంగా నష్టపరిహారం చెల్లించాలి అనే అంశాలు ఈ రోజు జరిగిన సమావేశంలో చర్చించారు. ఇప్పటి వరకు ఉన్న చట్టాల్లోని లోపాలపై కమిటీ సభ్యులు సీరియస్ గా డిస్కస్ చేశారు. విత్తన చట్టం ముసాయిదా రూపొందించడానికి ముందు కమిటీ ఫీల్డ్ విజిట్ చేసి, రైతుల నుండి అభిప్రాయాలు, సూచనలు. సలహాలు తీసుకోవాలని నిర్ణయానికి వచ్చారు. ఇక రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులతో జిల్లా స్థాయిలో కలెక్టరేట్ లో సమావేశాలు నిర్వహించాలని, సీడ్ కంపెనీలు, ఆర్గనైజర్లు, డీలర్స్ తో కూడా దశల వారీగా చర్చించాలని భావిస్తున్నారు. దానికోసం గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు సమావేశాలు నిర్వహించి విత్తన ముసాయిదాను రూపొందించాలని నిర్ణయం తీసుకుంది కమిటీ. విత్తన చట్టం ముసాయిదాలో ఎలాంటి అంశాలు ఉండాలి, రైతుల నుండి వచ్చే సూచనలకు ప్రాధాన్యత ఇస్తూ.. విత్తన చట్ట ముసాయిదా రూపొందించాలని కమిటీ సమావేశంలో నిర్ణయం తీసుకుంది.. ఈ సమావేశంలో విత్తన కమిటీ కన్వీనర్, వ్యవసాయ శాఖ డైరెక్టర్ బి. గోపి, కమిటీలో సభ్యులుగా ఉన్న సీడ్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి, రైతు కమిషన్ సభ్యులు భూమి సునీల్, కమిషన్ సలహాదారులు దొంతి నర్సింహా రెడ్డి, రామాంజనేయులు, కమిటీ సభ్యులు గా ఉన్న శ్రీనివాస్ రెడ్డి, వ్యవసాయ శాఖ అధికారి శివప్రసాద్ అగ్రికల్చర్ యూనివర్సిటీ నుండి డైరెక్టర్ సీడ్ ఎంవీ నగేష్ కుమార్, కమిషన్ మెంబర్ సెక్రెటరీ గోవింద్ , వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# ముంబైను ముంచెత్తిన వాన

(మొదటి పేజీ తరువాయి)

అనేక ప్రాంతాలు నీట మునిగాయి. రోడ్లు నదులను తలపించాయి. గత రెండు రోజుల్లో నలుగురు మరణించగా.. 40 ఇండ్లు ధ్వంసమయ్యాయి. వీలాంగర్‌లో కొండచరియలు విరిగిపడిన ప్రాంతంలో తొమ్మిది కుటుంబాలను సురక్షిత ప్రాంతానికి తరలించారు. ఇడుక్కిలో లోయర్ పెరియార్ డ్యామ్ (పంబ్లాడ్యామ్), మలంకారా డ్యామ్ షట్టర్లను తెరిచారు. పెరియార్, తొడుపూర్ఝా, మువట్టుపుర్ఝా నదుల వద్ద ఉన్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు రెడ్ అలర్ట్ జారీ చేశారు. ఈదురుగాలులతో కురుస్తున్న భారీ వర్షాలకు రైల్వే ట్రాక్‌పై ఒక చెట్టు విరిగి పడటంతో త్రిసూర్–గురువాయూర్ రూట్‌లో రైలు సర్వీసులకు దాదాపు రెండు గంటలు అంతరాయం ఏర్పడింది. ఆదివారం రాత్రి మువట్టుపుళ ఉత్తర ప్రాంతంలో నీటి ప్రవాహంలో వల్లికాడకు చెందిన జాబ్ (42) అనే వ్యక్తి కొట్టుకుపోయాడు. భారీ వర్షాలకు ఎర్నాకుళంలో ఒక కారు బోల్తా పడింది. ఈ ఘటనలో కొట్టాయంకు చెందిన ద్విచక్రవాహనదారుడు జేమ్స్‌కు గాయాలయ్యాయి. కోజికోడ్‌లో ఎకరూల్–కక్కయం రహదారిపై హిల్ హైవే నిర్మాణంలో ఉండగా.. అక్కడ స్వల్ప కొండచరియలు విరిగిపడ్డాయి. పాలక్కడ్‌లోని కురుత్తిచల్‌లో నది నీటి ప్రవాహంలో కొట్టుకుపోయిన ముబీన్ మురళీ కోసం గాలింపు చర్యలను పునరుద్ధరించారు. కేరళలోని అనేక ప్రాంతాలలో గంటకు 50–60 కిలోమీటర్ల వేగంతో బలమైన ఉపరితల గాలులు వీచే అవకాశమున్నదని తెలిసింది. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లకూడదని అధికారులు సూచించారు.

కర్నాటక తీర ప్రాంతాన్ని కూడా భారీ వర్షాలు ముంచెత్తాయి. పలు జిల్లాల్లో వానలు కురిశాయి. ముఖ్యంగా, రాష్ట్రంలోని దక్షిణ జిల్లాలలో జనజీవనం స్తంభించింది. దీంతో అధికార యంత్రాంగాలు అప్రమత్తమయ్యాయి. విపత్తు స్పందనా బృందాలను రంగంలోకి దించాయి. తీర కర్నాటకకు జారీ చేసిన రెడ్ అలర్ట్ ఐదు రోజుల వరకు ఉంటుందని అధికారులు చెప్పారు. బెళగావి జిల్లాలో గోడకూలి నిద్రలోనే మూడేండ్ల బాలిక మృతి చెందింది.

# ముగిసిన సరస్వతి పుష్కరాలు..

(మొదటి పేజీ తరువాయి)

3.50 లక్షల మంది సందర్శకులు కాళేశ్వరానికి వచ్చి స్నానాలు ఆచరించారు. అనంతరం ముక్తీశ్వర స్వామిని దర్శించు కున్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే పర్యవేక్షణలో ఆయా శాఖల అధికారులు పకడ్బందీ వసతులు కల్పించారు. గత 11రోజులుగా గోదావరి, ప్రాణహిత, అంతర్వాహిని సరస్వతీ త్రివేణి సంగమంలో పుష్కర స్నానం, స్వామి వారి దర్శనం కోసం వచ్చిన ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జిల్లా యంత్రాంగం తాగునీటి సరఫరా, త్రివేణి సంగమం వరకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించింది. వివిధ ప్రాంతాల నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసింది. వైద్య ఆరోగ్యశాఖ మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి ఓఆర్ఎస్, అస్వస్థతకు గురైన భక్తులకు వైద్య సేవలు అందించింది. పంచాయతీరాజ్ విభాగం మూడు షిఫ్టుల వారీగా పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించింది. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ద్వారా మంచినీరు, మరుగుదొడ్ల నిర్వ హణ చేపట్టారు. విద్యుత్ శాఖ ద్వారా నిరంతరం విద్యుత్ సరఫరా చేశారు. చిన్నారులు ఆట బొమ్మల కొనుగోళ్లు, శీతల పానీయాలు, నిమ్మ రసం, లస్సీ, విజయ డెయిరీ ఉత్పత్తులు, గ్రామీణ మంచినీటి సరఫరా శాఖ ఏర్పాటు చేసిన తాగునీరు సేవించి ఎండ తీవ్రత నుంచి ఉపశమనం పొందారు.

# సుప్రీంకోర్టుకు ముగ్గురు న్యాయమూర్తులు..

- కొలీజియం సిఫారసు..

**బలగం టీవి, హైదరాబాద్**

గౌహతి, కర్నాటక హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులు సహా ముగ్గురు న్యాయమూర్తులను సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా నియమించాలని కొలీజియం సిఫారసు చేసింది. కర్నాటక హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ అంజరియా, గౌహతి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి విజయ్ బిష్ణోయ్, బాంబే హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏఎస్ చందూర్కర్‌లను సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా నియమించాలని సూచించింది. మాజీ సీజేఐ జస్టిస్ సంజీవ్ కన్నా, జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ హృషికేశ్ రాయ్ ఇటీవల పదవీ విరమణ చేసిన విషయం తెలిసిందే. ఖాళీలను నియమించేందుకు ముగ్గురి పేర్లను చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల కొలీజియం నిర్ణయించింది. జస్టిస్ బేలా ఎం త్రివేది సైతం జూన్ 9న పదవీ విరమణ చేయనున్నారు. ఇదిలా ఉండగా.. సుప్రీంకోర్టులో మంజూరైన న్యాయమూర్తుల సంఖ్య 34 కాగా.. ప్రస్తుతం 31 మంది న్యాయమూర్తులు ఉన్నారు.

సుప్రీంకోర్టు తీర్పు తర్వాత 1993లో కొలీజియం వ్యవస్థ ఉనికిలోకి వచ్చింది. ఈ వ్యవస్థ కింద సుప్రీంకోర్టులోని అగ్రశ్రేణి ఐదుగురు



న్యాయమూర్తులు.. సుప్రీంకోర్టు, 25 హైకోర్టుల్లో న్యాయమూర్తుల నియామకం, బదిలీ, పదోన్నతులను సిఫారసు చేస్తారు. ఇదిలా ఉండగా.. జస్టిస్ బీవీ నాగరత్న కొలీజియం సభ్యురాలిగా నియమితులయ్యారు. జస్టిస్ అభయ్ ఎస్ ఓకా పదవీ విరమణ తర్వాత.. అత్యంత సీనియర్ న్యాయమూర్తుల్లో ఒకరైన జస్టిస్ బీవీ నాగరత్న సుప్రీంకోర్టు కొలీజియంలో చేరారు. ఆమె అక్టోబర్ 29, 2027న సీజేఐగా పదవీ విరమణ చేసే వరకు కొలీజియంలో కొనసాగనున్నారు. ప్రస్తుతం కొలీజియం సభ్యుల్లో చీఫ్ జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్, జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ నాగరత్న ఉన్నారు.

# ఎనిమిది రాజ్యసభ స్థానాలకు జూన్ 19న పోలింగ్

**బలగం టీవి, హైదరాబాద్**

రెండు రాష్ట్రాల్లో ఖాళీ కాబోతున్న ఎనిమిది రాజ్యసభ స్థానాలకు వచ్చే నెల 19న పోలింగ్ జరగనుంది. పోలింగ్ ముగియగానే అదేరోజు ఓట్లను లెక్కించి ఫలితాలను వెల్లడించనున్నారు. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. అసోంలో రెండు, తమిళనాడులో ఆరు రాజ్యసభ స్థానాలు ఖాళీ కాబోతున్నాయి.అసోంలో రాజ్యసభ సభ్యులు రంజన్ దాస్, బీరేంద్ర ప్రసాద్ బైస్యల పదవీకాలం జూన్ 14న ముగియనుంది. అదేవిధంగా తమిళనాడులో ఆరుగురు సభ్యులు అన్బుమణి రామదాస్, ఎం షణ్ముగం, ఎన్ చంద్రశేగరన్, ఎం మహ్మద్ అబ్దుల్లా, పీ విల్సన్, వైకో జూలై 24న పదవీ విరమణ చేయనున్నారు. ఈ ఎన్నికలకు సంబంధించిన జూన్ 2న నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు ఎన్నికల సంఘం తెలిపింది.నామినేషన్‌ల దాఖలుకు జూన్ 9 వరకు గడువు ఇవ్వనున్నారు. జూన్ 10 నామినేషన్‌ల స్క్రూటినీ నిర్వహించనున్నారు. అభ్యర్థిత్వాన్ని వదులుకోవడానికి తుది గడువు జూన్ 12. జూన్ 19న పోలింగ్ నిర్వహించనున్నారు. జూన్ 23తో ఈ రాజ్యసభ ద్వైవార్షిక ఎన్నికల ప్రక్రియ పూర్తిగా ముగియనుంది.

# తెలంగాణను తాకిన రుతుపవనాలు

(మొదటి పేజీ తరువాయి)

నిజామాబాద్, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, వికారాబాద్, సంగారెడ్డి జిల్లాలున్నాయి. మిగతా జిల్లాల్లో కూడా మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే సూచనలున్నాయి. ఈ నేపథ్యంలో ఆ జిల్లాలకు ఎల్లో హెచ్చరికను జారీ చేసింది. వచ్చే 48 గంటల పాటు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఆకాశం మేఘావృతమై ఉంటుంది. తేలికపాటి నుంచి మోస్తరు వానలు పడే సూచనలున్నాయి. సోమవారం రాత్రి 10 గంటల వరకు రాష్ట్రంలో 223 ప్రాంతాల్లో వర్షపాతం నమోదైంది. రంగారెడ్డి జిల్లా షాబాద్, మొహినాబాద్ మండలాల్లో పలుచోట్ల భారీ వర్షం కురిసింది. రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం చందన్‌వెళ్లిలో అత్యధికంగా 8.13 సెంటీమీటర్ల భారీ వర్షం పడింది.

# కేటీఆర్‌కు ఏసీబీ నోటీసులు జారీ చేయడంపై స్పందించిన హరీష్‌రావు, కవిత

**బలగం టీవి, హైదరాబాద్**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఏసీబీ నోటీసులు జారీ చేయడంపై ఎమ్మెల్యే హరీష్‌రావు, కవితలు స్పందించారు. వైఫల్యాలను కప్పిపుచ్చుకోడానికి, ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించడానికి కుట్రపూరితంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం కేటీఆర్‌కు నోటీసులు జారీ చేసిందని ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. ఏసీబీ నోటీసులు జారీ చేయడాన్ని సోషల్ మీడియా వేదికగా కవిత ఖండించారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుటిల రాజకీయ క్రీడలో భాగంగానే ఏసీబీ నోటీసులు జారీ చేసినట్లు స్పష్టమవుతోందన్నారు. తమ పార్టీ నాయకులకు వరుస నోటీసులు జారీ చేయడం వెనుక రాజకీయ దురుద్దేశం ఉన్నట్లు తేటతెల్లమైందని.. ఎవరెన్ని ఇబ్బందులు పెట్టాలని ప్రయత్నించినా తట్టుకొని నిలబడ్డ చరిత్ర కేసీఆర్ సైనికులదని స్పష్టం చేశారు. ఏసీబీ నోటీసులపై మాజీ మంత్రి హరీశ్‌రావు సైతం స్పందించారు. ప్రతీకార రాజకీయాలు రేవంత్‌రెడ్డి అభద్రతా భావానికి స్పష్టమైన సంకేతాలని.. కల్పిత కేసులు న్యాయస్థానాల్లో నిలువవు.. ప్రజామోదాన్ని పొందవని హరీశ్‌రావు పేర్కొన్నారు. కేటీఆర్‌కు అండగా నిలుస్తామని.. అంతిమంగా సత్యే గెలుస్తుందని హరీశ్‌రావు ట్వీట్ చేశారు.

# పార్టీ మారిన ఎమ్మెల్యేలకు ఉప ఎన్నికల్లో బుద్ధి చెప్పాలి

**బలగం టీవి, హైదరాబాద్**

బీఆర్ఎస్ పార్టీకి గుడ్‌బై చెప్పిన ఎమ్మెల్యేలకు రాబోయే ఉప ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరించారు. "కాంగ్రెస్ పార్టీ 18 నెలల పాలన చూసిన తర్వాత ఈ దశాబ్దంలో చూసిన అతి పెద్ద మోసం అదే పార్టీ మేనిఫెస్టో అనిపిస్తోంది" అని విమర్శించారు. తెలంగాణ భవన్‌లో గద్వాల నియోజకవర్గానికి చెందిన పలువురు కాంగ్రెస్ నేతలు బీఆర్ఎస్‌లో చేరారు. వారిని గులాబీ కండువాలతో స్వాగతించిన కేటీఆర్ ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వంపై విసుగుతో ఉన్నారని, "ఎన్ని రోజులు ఈ దరిద్రాన్ని భరించాలి? మళ్లీ కేసీఆర్ వచ్చేటట్లు ఏదైనా మార్గం లేదు కానీ?" అని అంటున్నారని కేటీఆర్ తెలిపారు. "దానికి ఒక్కటే పరిష్కారం ఉంది. మన పార్టీని వీడి వెళ్లిన 10 మంది ఎమ్మెల్యేలకు ఉప ఎన్నికల్లో ప్రజలే తగిన బుద్ధి చెబుతారు. వారిని ఓడించి సరైన గుణపాఠం చెబుతారు" అని ఘాటుగా స్పందించారు. "మన వెంటనే ఉండి, మనవాడినట్టే నటిస్తూ వెన్నుపోటు పొడిచిన వాళ్లు ఎవరో ఇప్పుడు అందరికీ బట్టబయలయ్యారు" అంటూ ఆయన తేటతెల్లంగా చెప్పారు. "ఇది ఆవేశంతో చెప్పడం కాదు. బాధతో మాట్లాడుతున్నాను. ఈ ఎమ్మెల్యేలకు ప్రజలే గుణపాఠం చెబుతారు" అని హితవు పలికారు.

# ఏసీబీకి చిక్కిన సబ్ రిజిస్ట్రార్

**బలగం టీవి, హైదరాబాద్**



ఖమ్మంరూరల్ సబ్ రిజిస్ట్రార్ జె.అరుణ రూ.30 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కింది. ఓ తండ్రి తన కుమారునికి భూమిని గిఫ్టుగా రిజిస్ట్రేషన్ చేస్తున్న క్రమంలో సబ్ రిజిస్ట్రార్ లంచం డిమాండ్ చేసింది. దాంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

ఖమ్మం నగరానికి చెందిన ఏలూరి రామకృష్ణకు ఖమ్మంరూరల్ మండలం తల్లంపాడులో రెండు వేల గజాల స్థలం ఉంది. ఆ భూమిని తన కుమారుడు శ్రీ చరణ్ పేరిట గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేయాలని అనుకున్నాడు. ఇందుకు ప్రభుత్వపరంగా రూ.51 వేల చలానాను తీసి రిజిస్ట్రేషన్‌కు సిద్ధమయ్యాడు. ఈ క్రమంలో డాక్యుమెంట్ రైటర్ ద్వారా సబ్ రిజిస్ట్రార్ కాసుల వేటకు దిగింది. రామకృష్ణను తొలుత రూ.50 వేలు లంచంగా అడిగారు. అందుకు డాక్యుమెంట్ రైటర్ పుచ్చకాయల వెంకటేశ్వర్లు సబ్ రిజిస్ట్రార్‌కు మధ్యవర్తిగా వ్యవహరించాడు. అయితే అంత మొత్తం తాను ఇచ్చుకోలేనని ప్రాథేయపడినా కనికరించలేదు. ఇవ్వాల్సిందేనని పట్టుపట్టారు. కొద్ది రోజుల తర్వాత రూ.30 వేలు ఇచ్చుకోగలనని రామకృష్ణ చెప్పడంతో అందుకు అంగీకరించారు. అనంతరం రామకృష్ణ ఏసీబీ డీఎస్పీ రమేష్‌ను ఆశ్రయించాడు. దాంతో రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు.. సోమవారం ఖమ్మం రూరల్ సబ్ రిజిస్టర్ ఆఫీస్ ఎదుట మాటు వేశారు. తొలుత రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి కానిచ్చారు. అనంతరం మీడియేటర్‌గా వ్యవహరించిన పుచ్చకాయల వెంకటేశ్వర్లుకు రూ.30 వేలు ఇచ్చే క్రమంలో అత్యంత చాకచక్యంగా అధికారులు వారిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

# ప్రజావాణి అర్జీలు పెండింగ్‌లో పెట్టవద్దు..



**- కలెక్టర్ సందీప్ కుమార్ ఝూలి**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

ప్రజావాణిలో వచ్చే అర్జీలు పెండింగ్‌లో పెట్టవద్దని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి కలెక్టర్ సందీప్ కుమార్ ఝా దరఖాస్తులు స్వీకరించి, వాటి పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు.

**వైద్యానికి రూ. రెండు లక్షల ఆర్థిక సహాయం అందించిన కలెక్టర్**

ముస్తాబాద్ మండలం పోత్గల్ గ్రామానికి చెందిన బొల్లె శ్రీనివాస్ పక్షవాతంతో ఇబ్బంది పడుతున్నాడు. సాయం అందించాలని శ్రీనివాస్ భార్య శంకరవ్వ కలెక్టర్ కు విన్నవించారు. దీంతో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా స్పందించి, శ్రీనివాస్ వైద్యానికి రూ. రెండు లక్షల చెక్కును అందజేశారు. వైద్యానికి సహాయం అందించిన కలెక్టర్ కు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# సిరిసిల్లలో రాజుకున్న ప్రోటోకాల్ రగడ ..

**-బీఆర్ఎస్,కాంగ్రెస్ నాయకుల మధ్య వాగ్వాదం,తోపులాట**

**-పోలీసుల లాఠీచార్జీ**

**బలగం టీవీ, సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ క్యాంపు ఆఫీస్ వద్ద వద్ద బీఆర్ఎస్ కాంగ్రెస్ నాయకుల మధ్య ప్రోటోకాల్ వివాదం తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. సోమవారం ప్రొటోకాల్ పాటించాలని డిమాండ్ చేస్తూ,కేటీఆర్ క్యాంప్ ఆఫీస్ లో సీఎం రేవంత్ రెడ్డి ఫోటో పెట్టడానికి కాంగ్రెస్ నేతలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అక్కడికి బీఆర్ఎస్ నాయకులు చేరుకోవడంతో ఇరు వర్గాల మధ్య వాగ్వాదం,తోపులాట జరగడంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. అప్పటికే క్యాంపు కార్యాలయం వద్ద భారీగా మోహరించిన పోలీసులు



ఇరువర్గాలను అడ్డుకునే ప్రయత్నం చేయగా, పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో ,పోలీసులు లాఠీఛార్జి చేసి ఇరువర్గాలను చెదరగొట్టారు. బీఆర్ఎస్ కాంగ్రెస్ నాయకులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

# హామీల అమలుకై బీజేపీ ధర్నా..



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన 'ఆరు గ్యారంటీ' హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ, ముస్తాబాద్ మండల పరిషత్ కార్యాలయం వద్ద బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షులు సౌల్ల క్రాంతి కుమార్ నేతృత్వంలో లబ్ధిదారులు ఈ నిరసనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సౌల్ల క్రాంతి కుమార్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ అడ్డగోలుగా హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలకు చెప్పిన ఏ హామీని నెరవేర్చలేదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలని, లేదంటే ప్రజలకు క్షమాపణ చెప్పి వెంటనే గద్దె దిగిపోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మోసపూరిత మాయమాటలతో అధికారంలోకి వచ్చి ఆరు గ్యారంటీల పథకాన్ని పూర్తిగా అమలు చేయకుండా కాలక్షేపం చేస్తోందని ఆయన మండిపడ్డారు. ఈ కార్యక్రమం లో బీజేవైఎం జనర్ధన్, మెంగనీ మహేందర్, చిట్నేని శ్రీనివాస రావు, బాధా నరేష్ , వరి వెంకటేష్, ఎదూనూరి గోపీ,కోల కృష్ణా, చీకోటి మహేష్, పొన్నాల సత్యం రెడ్డి, బత్తుల గణేష్, శివ, దేవరాజు,మిస శంకర్, ఊరడి రాజు, మోహన్, బాల్ రెడ్డి, దిటి సత్తయ్య, రమేష్, మిస శ్రీను, మద్దికుంట రమేష్, అజయ్, పెంటం నరేష్, పరకాల వేణు, రఘు, ప్రశాంత్, పద్మ, మహేశ్వరి, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, లబ్దిదారులు పాల్గొన్నారు.

# బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే

**-గీవెన్స్ డే కార్యక్రమంలో 18 ఫిర్యాదులు స్వీకరణ**

**-జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే.**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ మహేష్. బి.గితే తెలిపారు. సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 18 ఫిర్యాదులు స్వీకరించి, ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.

ఈ సందర్భంగా ఎస్పీ మహేష్. బి.గితే మాట్లాడుతూ.. ప్రజలకు పోలీస్ సేవలు



మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్ధవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు.

# నేడు పెద్దింటి కథల కార్యశాల

**బలగం టీవీ, సిరిసిల్ల**



తెలంగాణ ప్రభుత్వం సాహిత్య అకాడమీతో కలిసి యువ కథకుల కోసం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కథల కార్యశాల తేదీ 27 మే మంగళవారం ఉదయం 10 గంటల నుంచి రవీంద్రభారతి మినీ హాల్ లో జరగనుంది. ఈ కార్యక్రమానికి ప్రొహిబిషన్, ఎక్సైజ్, పర్యాటక మరియు సాంస్కృతిక పురావస్తు శాఖ మాత్యులు జూపల్లి కృష్ణారావు ముఖ్య అతిథిగా, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ విశిష్ట అతిథిగా హాజరుకానున్నారు. ఈ కథల కార్యశాలలో ప్రముఖ సినీ రచయిత పెద్దింటి అశోక్ కుమార్ "కథలు ఎలా రాయాలి" అనే అంశంపై యువ కథకులకు రోజంతా శిక్షణ ఇవ్వనున్నారు. ఇది కొత్తగా రాస్తున్న యువ రచయితలకోసమే నిర్వహిస్తున్న కార్యశాల అని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని సాహిత్య అకాడమీ కార్యదర్శి డాక్టర్ నామోజు బాలా చారి పేర్కొన్నారు. పెద్దింటి ఇప్పటికే యూనివర్సిటీలలో, డిగ్రీ కళాశాలలలో అనేక కథల కార్యశాలలు నిర్వహించారు. ఆయన రచించిన కథలు, నవలలు పలు యూనివర్సిటీల సిలబస్‌లలో భాగంగా ఉన్నాయి. ప్రస్తుతం సినిమాలకు కథలు పాటలు మాటలు రాస్తున్నారు.

# బీఆర్ఎస్ నాయకుల పై లాఠీ చార్జ్ హేయమైన చర్య..

- **కరీంనగర్ మాజీ పార్లమెంట్ సభ్యుడు బోయినపల్లి వినోద్ కుమార్**

**బలగం టీవీ, హైదరాబాద్**



రాజన్న సిరిసిల్ల జిల్లాలో సోమవారం కేటీఆర్ క్యాంప్ కార్యాలయంలో సీఎం రేవంత్ రెడ్డి ఫోటో పెట్టాలని బీఆర్ఎస్ కాంగ్రెస్ నాయకుల మధ్య జరిగిన తోపులాటలో బిఆర్ఎస్ కార్యకర్తలపై పోలీసులు లాఠీచార్జి చేయడానికి తీవ్రంగా ఖండిస్తున్నామని కరీంనగర్ మాజీ పార్లమెంట్ సభ్యుడు బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు గిచ్చి కయ్యం పెట్టుకుంటున్నారని, సిరిసిల్లలో ఉన్న కేటీఆర్ క్యాంప్ ఆఫీస్ ఎమ్మెల్యే కార్యాలయం కాదని,అది కేవలం ఎమ్మెల్యే కోసం నిర్మించుకున్న గృహమేనని అన్నారు. శాసనసభ్యులు నిర్మించుకున్న ఇంటిలో సీఎం రేవంత్ రెడ్డి ఫోటో ఎలా పెడతారని ప్రశ్నించారు. బీఆర్ఎస్ నాయకులపై పోలీసులు లాఠీచార్జ్ చేయడం హేయమైన చర్య అని పేర్కొన్నారు.

# ఆడలేక మద్దెల దరువు అన్నట్టుంది కాంగ్రెస్ వ్యవహారం..

- **బీఆర్ఎస్ నేత ఎనగుల రాకేష్ రెడ్డి**

**బలగం టీవీ, హైదరాబాద్**



తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత పరిపాలన చేతగాక, ప్రజా సమస్యలను పరిష్కరించలేక దాడులకు పాల్పడుతోందని బీఆర్ఎస్ నేత ఎనగుల రాకేష్ రెడ్డి అన్నారు. సిరిసిల్లలోని మాజీ మంత్రి కేటీఆర్ క్యాంపు కార్యాలయంపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ వ్యవహారం "ఆడలేక మద్దెల దరువు" అన్నట్టు ఉందని ఎద్దేవా చేశారు. "ఈ చిల్లర చిలిపి చేష్టలతో ప్రజా వ్యతిరేకతను కప్పిపుచ్చుకోలేరు" అని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫోటో ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసుల్లో కాదని, "నేషనల్ హెరాల్డ్ కేసు ఛార్జ్ షీట్ లో పెట్టాలి. ఆత్మహత్య చేసుకున్న సిరిసిల్ల నేతన్నల సమాధుల దగ్గర పెట్టాలి అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కేటీఆర్ క్యాంపు కార్యాలయంపై దాడి కేవలం వ్యక్తిగతం కాదని, ఇది ప్రజాస్వామ్య వ్యవస్థ మీద, రాజ్యాంగ విలువలపై జరిగిన దాడి అని పేర్కొన్నారు. "రాజ్యాంగం పట్టుకొని రాజ్యం ఏలుతానని దేశమంతా తిరుగుతున్న రాహుల్ గాంధీ దీనికి సమాధానం చెప్పాలి. ఇదేనా మీ ప్రేమ దుకాణమా?" అని ప్రశ్నించారు. ఒక అధికార పార్టీ కార్యకర్తలు ప్రతిపక్ష ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసుపై దాడి చేస్తున్నారంటే, ప్రతిపక్షాన్ని నేరుగా ఎదుర్కోలేక, ప్రజా సమస్యలు తీర్చలేక దాడులను ఎంచుకున్నారు అన్నమాట అని విమర్శించారు. ప్రజా సమస్యలను తప్పుదారి పట్టించడానికి పాలన చేతకాక రేవంత్ రెడ్డి ఆడిస్తున్న చిల్లర ఆట ఇది అని దుయ్యబట్టారు. శాంతి భద్రతలు కాపాడాల్సిన ప్రభుత్వమే పనికిమాలిన దాడులకు దిగడం హేయమైన చర్య అని అన్నారు.

# బీఆర్ఎస్ నాయకులపై లాఠీచార్జ్ చేయడం దుర్మార్గం..

- **సిరిసిల్ల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం పై కాంగ్రెస్ నాయకులు దాడి చేయడం సిగ్గు చేటు**
- **ఇల్లంతకుంట మండల మాజీ వైస్ ఎంపీపీ సుదగోని శ్రీనాథ్ గౌడ్**

**బలగం టీవీ, సిరిసిల్ల**



సిరిసిల్ల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం పై కాంగ్రెస్ నాయకులు దాడి చేయడం సిగ్గు చేటు అని ఇల్లంతకుంట మండల మాజీ వైస్ ఎంపీపీ సుదగోని శ్రీనాథ్ గౌడ్ అన్నారు. సోమవారం ఇల్లంతకుంట మండల కేంద్రంలో విలేకరులతో శ్రీనాథ్ గౌడ్ మాట్లాడుతూ సిరిసిల్ల ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం పైకి దాడికి వచ్చిన కాంగ్రెస్ నాయకులను అడ్డుకోకుండా,అక్కడ అడ్డుకున్న బిఆర్ఎస్ నాయకుల పై లాఠీచార్జ్ చేయడం దుర్మార్గం అని అన్నారు. కాంగ్రెస్ నాయకులను సూటిగా అడుగుతున్న గత 10 ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో ఒక్కరోజైనా సీఎం కేసీఆర్ ఫోటో పెట్టారా అని అన్నారు. నేడు మంత్రులుగా ఉన్నవారు, నాడు ప్రతిపక్షంలో ఉన్న బట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీతక్క లాంటివారు నాడు నాటి సీఎం కేసీఆర్ ఫోటో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాలలో పెట్టారా అని ప్రశ్నించారు. కేసీఆర్ ఫోటో పెట్టాలని నాడు బిఆర్ఎస్ నాయకులు ఏమన్నా దాడులు చేశారా అని అన్నారు. ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యేలు వారి కార్యాలయంలో అధికార పార్టీకి సంబంధించిన ముఖ్యమంత్రుల ఫోటోలు పెట్టాలని రూల్స్ బుక్ లు ఏమన్నా ఉన్నాయా అని అన్నారు. మరి అట్లయితే దేశ ప్రధాని నరేంద్ర మోడీ ఫోటోలను ప్రతిపక్ష పార్టీకి సంబంధించిన కాంగ్రెస్ గాని మిగతా పార్టీ నాయకులు వారి కార్యాలయంలో, ఎంపీ క్వార్టర్సులలో పెట్టుకుంటున్నారా అని అన్నారు. ఇప్పటికి అయినా కాంగ్రెస్ ప్రభుత్వం బుద్ధి తెచ్చుకొని పాలనా మీద దృష్టి పెట్టాలని అన్నారు. కాంగ్రెస్ నాయకులు ఇటువంటి చిల్లర పనులు చేస్తే రానున్న రోజుల్లో ప్రజలే బుద్ధి చెప్తారని అన్నారు

## పవన్ సినిమాను ఆపే దమ్ము, ధైర్యం ఎవరూ చేయరు

- నిర్మాత దిల్ రాజు



**బలగం టీవి, హైదరాబాద్**

పవన్ కల్యాణ్ సినిమాను ఆపే దమ్ము, ధైర్యం ఎవరూ చేయరని.. పవన్ కల్యాణ్ సినిమాను టార్గెట్ చేశామనడం తప్పని ప్రముఖ నిర్మాత దిల్‌రాజు అన్నారు. సినిమా వాళ్లకు రెండు తెలుగు ప్రభుత్వాలు ఎంతో ముఖ్యమని తెలిపారు. గత కొన్ని రోజులుగా సినీ పరిశ్రమలో నెలకొన్న వివాదంపై ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సినీ పరిశ్రమ మేలు కోసం ఏపీ డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ ఎంతో చేశారని పేర్కొన్నారు. ఛాంబర్ నుంచి సీఎంను కలిసేందుకు వెళ్దామనే విషయం అందరూ కలిసి ఆలోచించలేదు కానీ.. ఎవరికివారే వారి సినిమా గురించి అడుగుతున్నారని తెలిపారు.

"కరోనా సమయంలో తప్పితే థియేటర్లు ఎప్పుడూ మూయలేదు. థియేటర్లు మూసుకుంటే ఎగ్జిబిటర్లకే నష్టం కదా.!. బంద్ అనే మాట లేకుండా సమస్య పరిష్కరించాలని కోరాం. అసలు విషయాన్ని పవన్ సినిమాపైకి పక్కదారి పట్టించారు. పవన్‌కళ్యాణ్ సినిమా ఆపే దమ్ము, ధైర్యం ఎవరూ చేయరు. ఎపి ప్రభుత్వానికి రాంగ్ కమ్యూనికేషన్ వెళ్లింది.. అందుకే మంత్రి స్పందించారు. జూన్‌లో పవన్ సినిమా సహా పలువురి సినిమాలు ఉన్నాయి. సినీ పరిశ్రమకు ఏప్రిల్, మే నెలలు చాలా కీలకం. సినీ పరిశ్రమను ఎలా కాపాడుకోవాలనేదే మన ఆలోచన కావాలి. తూర్పుగోదావరి జిల్లాలో మొదలైన చిన్న విషయాన్ని రాష్ట్రమంతా ప్రచారం చేశారు" అని దిల్ రాజు పేర్కొన్నారు.

"గేమ్ చేంజర్ మూవీ తొలిరోజే పైరసీ వచ్చింది. ఆ పైరసీ చేసింది కూడా మరో నిర్మాతే కావచ్చు. ఇండస్ట్రీలో కొందరు నీచంగా ప్రవర్తిస్తున్నారన్నారు. తెలంగాణలో 370 థియేటర్లు ఉంటే నాకు 30 థియేటర్లున్నాయి. పర్సంటేజ్ విధానం ఉంటే బాగుంటుందని కొందరు చెప్పారు. ఆరు నెలలుగా వస్తున్న రెవెన్యూ గురించి ఆరా తీశాం. రెంట్, పర్సెంటేజ్ పద్ధతిలో ఆడే సినిమాలపైనే వివాదం నెలకొంది. తూర్పు గోదావరి జిల్లాలో కొందరు ఎగ్జిబిటర్లు , డిస్ట్రిబ్యూటర్లు భేటీ అయ్యారు. ఎగ్జిబిటర్ల మీటింగ్‌తో అసలు టాపిక్ మొదలైంది" అని అన్నారు. ఇది ఆ జిల్లా ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్ల విషయం మాత్రమే. సినిమాలకు మొదటి వారం రెంట్ ఇస్తాం. రెండో వారం నుంచి పర్సెంటేజ్ ఇస్తున్నాం. నష్టమెందుకు వస్తుందో ఆరాతీశామన్నారు.

సినీ పరిశ్రమకు కొత్త టాలెంట్‌ను పరిచయం చేయాలనేదే తన లక్ష్యమని. అందుకోసం దిల్‌రాజు డ్రీమ్స్ అనే కంపెనీ ప్రారంభించామని ఆయన స్పష్టం చేశారు. "అల్లు అరవింద్‌పై కూడా అనేక విషయాలు దుష్ప్రచారం చేశారు. మాకు ఏదైనా సమస్యలు వస్తే ప్రభుత్వాలే పరిష్కరించాలి. పర్సంటేజ్, రెంట్ అంటూ మాలోనే విభేదాలు ఉన్నాయి. ఈ ఎపిసోడ్‌కు ఇప్పటికైనా తెరదించాలని కోరుతున్నా. నిర్మాతలు, ఎగ్జిబిటర్లకు ప్రభుత్వాలతో పని ఉంటుంది. వారి సమస్యలపై ప్రభుత్వాలతో మాట్లాడతాం. సినీ పరిశ్రమపై నెగెటివ్ ప్రచారం చేయవద్దని అందరినీ కోరుతున్నాం. సమస్యలను మా వద్దకు తీసుకొస్తే ఛాంబర్ అధ్యక్షుడిగా స్పందిస్తా. సమస్యల పరిష్కారానికి ఛాంబర్ అనేది కీలకం. ఏ విషయంపై అయినా ఏకాభిప్రాయం ఉండదు భిన్నాభిప్రాయాలు సహజం" అని దిల్ రాజు తెలిపారు.

## టాప్1కు పంజాబ్.. టాప్4లోనే ముంబై

- ముంబై ఇండియన్స్‌పై పంజాబ్ కింగ్స్ విజయం
- 7 వికెట్ల తేడాతో ఘన విజయం
- నేడు జరగనున్న ఆర్సీబీ ఎల్ఎస్‌జీ మ్యాచ్‌తో తేలనున్న ప్లే ఆఫ్ ప్రత్యర్థులు




**బలగం టీవి, హైదరాబాద్**

పంజాబ్ కింగ్స్ టాప్ 1కు దూసుకెళ్లింది. ముంబై ఇండియన్స్‌తో జైపూర్ వేదికగా సోమవారం (మే 26) ముగిసిన మ్యాచ్ లో 7 వికెట్ల తేడాతో పంజాబ్ ఘన విజయం సాధించింది.

టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన ముంబై ఇండియన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 184 పరుగులు చేసింది. ఓపెనర్లు రికెల్ టన్, రోహిత్ శర్మ క్రీజ్ లో కుదురుకోవడానికి సమయం ఎక్కువగా తీసుకున్నారు. తొలి వికెట్ కు వీరిద్దరూ 45 పరుగులు జోడించిన తర్వాత రికెల్ టన్ ను మార్కో జాన్సెన్ ఔట్ చేశాడు. సూర్య కుమార్ యాదవ్ (39 బంతుల్లో 57:6 ఫోర్లు, 2 సిక్సర్లు) హాఫ్ సెంచరీతో చెలరేగాడు. రోహిత్ శర్మ 21 బంతుల్లో 24 పరుగులు చేసి ఔటయ్యాడు. ఆ తర్వాత తిలక్ వర్మ ఒక పరుగు మాత్రమే చేసి నిరాశపరిచాడు. విల్ జాక్స్ 17 పరుగులు చేసి ఔటయ్యాడు. కెప్టెన్ హార్దిక్ పాండ్యతో కలిసి సూర్య స్వల్ప భాగస్వామ్యాన్ని నెలకొ ల్పాడు. ఈ క్రమంలో 34 బంతుల్లోనే హాఫ్ సెంచరీ మార్క్ అందుకున్నాడు. ఇన్నింగ్స్ చివర్లో నమన్ ధీర్ (20) వేగంగా బ్యాటింగ్ చేయడంతో ముంబై 180 పరుగుల మార్క్ చేరుకుంది. పంజాబ్ బౌలర్లలో మార్కో జాన్సెన్, విజయ్ కుమార్ వైశక్, అర్షదీప్ సింగ్ రెండు వికెట్లు పడగొట్టారు. హర్‌ప్రీత్ బ్రార్ కు ఒక వికెట్ దక్కింది.

పంజాబ్.. బ్యాటింగ్ లో ఆస్ట్రేలియా ప్లేయర్ జోస్ ఇంగ్లిస్ (42 బంతుల్లో 73:9 ఫోర్లు, 3 సిక్సర్లు), ప్రియాంష్ ఆర్య (35 బంతుల్లో 62:9 ఫోర్లు, 2 సిక్సర్లు) పంజాబ్ విజయంలో కీలక పాత్ర పోషించారు. సాంట్నర్ ఈ జోడీని 15 ఓవర్ తొలి బంతికి విడగొట్టాడు. ఆర్య 62 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద ఔటయ్యాడు. ఇంగ్లిస్ కూడా ఔటైనా చివర్లో శ్రేయాస్ అయ్యర్ (26) మ్యాచ్ ను ముగించాడు. పంజాబ్ కింగ్స్ 18.3 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 187 పరుగులు చేసి గెలిచింది. ముంబై బౌలర్లలో సాంట్నర్ రెండు, బుమ్రా ఒక వికెట్ పడగొట్టారు.

## రేపు హరిహర వీరమల్లు నుంచి 'తారా తారా' పాట

**బలగం టీవి, హైదరాబాద్**




పవర్ స్టార్ పవన్ కల్యాణ్ నటించిన చిత్రం 'హరి హర వీరమల్లు'. ఈ సినిమా నుంచి 'తారా తారా' లిరికల్ పాటను మే 28వ తేదీన ఉదయం 10:20 గంటలకు విడుదల చేయనున్నట్లు చిత్ర నిర్మాణ సంస్థ మెగా సూర్య ప్రొడక్షన్స్ అధికారికంగా ప్రకటించింది. అలాగే నటి నిధి అగర్వాల్‌కు సంబంధించిన ఒక ఆకట్టుకునే పోస్టర్‌ను కూడా చిత్ర బృందం పంచుకుంది. జ్యోతి కృష్ణ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ ప్రతిష్ఠాత్మక చిత్రంలో పవన్ కల్యాణ్ సరసన నిధి అగర్వాల్ కథానాయికగా నటిస్తోంది. బాలీవుడ్ నటుడు బాబీ డియోల్‌తో పాటు సునీల్, రఘుబాబు, సుబ్బరాజు, నోరా ఫతేహి వంటి ప్రముఖ నటీనటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. మెగా సూర్య ప్రొడక్షన్స్ బ్యానర్‌పై ఎ. దయాకర్ రావు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమాకు ఆస్కార్ విజేత, ప్రముఖ సంగీత దర్శకుడు ఎం.ఎం. కీరవాణి స్వరాలు సమకూరుస్తుండటం విశేషం.



## ఏఐ సినిమా వచ్చేసింది

**-15 మంది ఏఐ క్యారెక్టర్లతో "లవ్ యూ" సినిమా**

**తొలి ఏఐ సినిమాగా రికార్డు**

**బలగం టీవి, హైదరాబాద్**

ఏఐ సాంకేతికతతో నటీనటులు, క్యారెక్టర్ ఆర్టిస్టులు లేకుండానే సినిమా చిత్రీకరణ పూర్తి చేసి విడుదల చేశారు. అవును హీరో హీరోయిన్లే కాకుండా ఇతర ఆర్టిస్టులు, మొత్తం 15 మంది ఏఐ క్యారెక్టర్లతో ఒక పూర్తి సినిమా ఇటీవల "లవ్ యూ" పేరుతో కన్నడ భాషలో విడుదలైంది. ఈ సినిమా ప్రపంచంలోనే తొలి ఏఐ చిత్రంగా రికార్డు సృష్టించింది. ఈ సినిమా కోసం లేని నటులను సృష్టించడమే కాకుండా, ఒక అద్భుత మాయాలోకాన్ని ప్రేక్షకుల ముందు ఉంచింది ఏఐ. ఈ చిత్రంలో కనిపించే ఊళ్లు, కార్లు, రైళ్లు, చెట్లు చేమలు అన్నీ కల్పితమే. ఇది అంతా కృత్రిమ మేధస్సు చేసిన ఇంద్రజాలమే. సినిమాలో ఒక్క షాట్ కూడా కెమెరాతో చిత్రీకరించలేదు. తెర ముందు ఇలా మాయా ప్రపంచాన్ని సృష్టించడమే కాకుండా, తెర వెనుక ఈ చిత్రానికి నేపథ్య సంగీతాన్ని, పాటలకు బాణీలను అందించింది కూడా కృత్రిమ మేధనే.




## సంగీత్ శోభన్ గ్యాంబ్లర్స్ టీజర్ విడుదల

**బలగం టీవి, హైదరాబాద్**

మ్యాడ్, మ్యాడ్ స్క్వేర్' చిత్రాలతో సూపర్ హిట్‌లు అందుకున్న నటుడు సంగీత్ శోభన్ నటిస్తున్న తాజా చిత్రం గ్యాంబ్లర్స్. రేష్మాస్ స్టూడియోస్, స్నాప్ అండ్ క్లాప్ ఎంటర్‌టైన్ మెంట్ పతాకంపై నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని కెఎస్‌కె చైతన్య దర్శకత్వం వహిస్తున్నాడు. ఇందులో ప్రశాంతి చారులింగా కథానాయికగా నటిస్తోంది. జూన్ 6న ఈ సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకురానుండగా, చిత్రబృందం ప్రమోషన్ స్పీడ్ పెంచింది. ఈ క్రమంలో తాజాగా టీజర్‌ను విడుదల చేసింది. యుద్ధం ఎక్కడ మొదలుపెట్టాలో తెలియాలి.. జూదం ఎక్కడ ఆపాలో తెలియాలి అనే డైలాగ్ ఆకట్టుకుంటోంది. పేకాట జూదం నేపథ్యంలో ఈ మూవీ రూపొందినట్లు టీజర్ చూస్తే తెలుస్తుంది. రాకింగ్ రాకేశ్, పృథ్వీరాజ్ బన్న, సాయి శ్వేత కీలక పాత్రల్లో నటిస్తున్నారు. మిస్టరీ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం తెరకెక్కుతుంది.

## సంక్రాంతికి 'అనగనగా ఒక రాజు'

**బలగం టీవి, హైదరాబాద్**




నవీన్ పొలిశెట్టి, మీనాక్షి చౌదరి జంటగా నటిస్తున్న 'అనగనగా ఒక రాజు' చిత్రం 2026 సంక్రాంతికి విడుదల కానుంది. ఈ విషయాన్ని నవీన్ సోషల్ మీడియా ద్వారా ఫన్నీ వీడియోతో ప్రకటించారు. "నెక్స్ట్ రాబోతోంది.. ఆరడుగుల అందగాడు, పిల్లలు పెద్దలు అందరూ ఇష్టపడేవాడు. అమ్మాయిల గుండె చప్పుడు.. మన ముందుకొచ్చేదెప్పుడు..ఇక టెన్షన్ ఎందుకు దండగ. రాజుగారు ఎక్కడుంటే అక్కడ పండగ" అంటూ వచ్చిన ఈ వీడియో అలరిస్తోంది. ఇందులో నవీన్ పోలిశెట్టి లుంగీ బనియన్ లో ఒక రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్ పై రయ్యుమంటూ వచ్చారు. కాళ్లకు పారగాన్ చెప్పులు, నోట్లో వేప పుల్లతో పక్కా పల్లెటూరి అబ్బాయి లుక్ లో దర్శనమిచ్చారు. మారి దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కుతోంది.




## 'కుబేర' టీజర్ విడుదల

**బలగం టీవి, హైదరాబాద్**

దర్శకుడు శేఖర్ కమ్ముల, హీరోలు నాగార్జున, ధనుష్ ప్రధాన పాత్రల్లో కుబేర చిత్రాన్ని రూపొందిస్తున్నారు. రష్మిక హీరోయిన్‌గా నటించగా, దేవిశ్రీ ప్రసాద్ మ్యూజిక్ అందించారు. ఈ చిత్రం జూన్ 20న విడుదల కానుంది. ' ట్రాన్స్ ఆఫ్ కుబేర' పేరుతో ఆదివారం టీజర్‌ను చిత్ర బృందం విడుదల చేసింది.

## ఆస్కార్ నటులు ఎక్కువైపోయారు : బండ్ల గణేష్

**బలగం టీవి, హైదరాబాద్**



బండ్ల గణేష్ సోమవారం చేసిన పోస్ట్ వైరల్‌గా మారింది. "ఆస్కార్ నటులు, కమలహాసన్లు ఎక్కువైపోయారు. వీళ్ల నటన చూడలేకపోతున్నాం" అంటూ ఆయన చేసిన పోస్ట్ వైరలవుతోంది. మరి తాను ఇండస్ట్రీ లోనే ఎవరినో ఉద్దేశించి కావాలనే అన్నారు అని అది ఎవరై ఉంటారు అనే చర్చ ఇపుడు మొదలైంది.